Eenadu

02-14/11/17

# ప్రపంచంలోనే మన మెట్రో పెద్దది

- 28న ప్రారంభించనున్న ప్రధాని: మంత్రి కేటీఆర్
- బడుగుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: జగదీశ్వర్‌రెడ్డి
- జిల్లాలో చోదక శిక్షణ కేంద్రం: పట్నం మహేందర్‌రెడ్డి



ఈనాడు - హైదరాబాద్

ప్రపంచంలోనే తొలిసారి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకానున్న మెట్రో రైలు అతిపెద్ద ప్రాజెక్టు అని మంత్రి కేటీఆర్ చెప్పారు. సోమవారం ప్రశ్నోత్తరాల్లో భాజపా సభ్యులడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 30 కిలోమీటర్ల దూరంతో మియాపూర్-నాగోల్ మధ్య ప్రారంభమయ్యే రైలు దేశంలో మొదటిది(పొడవులో) అవుతుందన్నారు. ఈ నెల 28న హైదరాబాద్ వస్తున్న ప్రధాని మోదీ చేతుల మీదుగా మెట్రో ప్రాజెక్టు ప్రారంభమవుతుందన్నారు. ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.3 వేల కోట్లలో ఇప్పటి వరకు రూ.2,240 కోట్లు ఖర్చుచేసిందని, కేంద్రం 1,458 కోట్లు ఇస్తుండగా రూ.958 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మెట్రో నిర్మాణం డిజైన్‌ను మార్చాలని కమిటీ కూడా వేశామన్నారు. అసెంబ్లీ ముందు నుంచి వద్దనుకున్నామని, డిజైన్ మార్చితే శాసనమండలి ఉన్న జూబ్లీహాల్‌కు పూర్తినష్టం వస్తుందని నిపుణులు పేర్కొనడంతో వెనక్కు తగ్గినట్లు వివరించారు. సుల్తాన్‌బజార్‌లో వ్యాపార సముదాయాలు దెబ్బతినే పరిస్థితి ఉండటంతో మెట్రో నిర్మాణాన్ని 60 అడుగులకు తగ్గించామని వివరించారు. పాతబస్తీలో మెట్రో విస్తరణపై ప్రభుత్వానికి స్పష్టత ఉందని, ఇప్పుడు పనులు చేపట్టే పరిస్థితి లేదని, ఫలక్‌నుమా నుంచే పనులు ప్రారంభిస్తామన్నారు. వచ్చే ఏడాది చివరినాటికి మెట్రో పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందన్నారు. హైదరాబాద్ మెట్రోకు 57 రైళ్లు వచ్చి సిద్ధంగా ఉన్నాయన్నారు. నాగ్‌పూర్ మెట్రో ప్రారంభించేందుకు రెండు రైళ్లు కావాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్ సీఎం కేసీఆర్‌ను అడగడంతో పంపామన్నారు. రైళ్లను నడిపేందుకు అదనపు వ్యయమవుతోందని నిర్మాణ సంస్థ ఉత్తరాలు రాస్తోందని, ప్రభుత్వం మాత్రం ఎలాంటి భరోసా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఏడాది ముందే రెండు మార్గాలు పూర్తయ్యాయని, ఆ మార్గాల్లో ట్రాఫిక్ లేకపోతే మెట్రో విఫలం అంటారని, ఈ చివర నుంచి ఆ చివరకు సిద్ధమైనప్పుడే ప్రారంభిద్దామని సీఎం సూచించారని, దీంతో ప్రారంభానికి అప్పుడు ముందుకెళ్లలేదని చెప్పారు. పీపీపీపై అనుమానాలు వ్యక్తం చేసిన శ్రీధరన్ ఇటీవల హైదరాబాద్ వచ్చిన సమయంలో సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణపై ఇటీవలె సీఎం అధికారులతో చర్చించారని పేర్కొన్నారు. నగరంలో రెండో దశ ఎంఎంటీఎస్ విస్తరణకూ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, దీనికోసం రూ.817 కోట్లు కేటాయించిందన్నారు. రాయగిరి రైల్వే స్టేషన్‌కు యాదాద్రి స్టేషన్‌గా నామకరణం చేస్తున్నామని, యాదాద్రి వరకు పొడిగింపునకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు స్పష్టం చేశారు.

- షెడ్యూలు కులాల అభివృద్ధి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిరుద్యోగులు, యువకుల ఆర్థిక స్వావలంబనకు రూ.774.76 కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. 77,114 మంది యువకులకు 80శాతం రాయితీ కింద రుణాలిచ్చామన్నారు. సాంప్రదాయేతర ఇందన వనరుల ద్వారా విద్యుత్తు ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ ముందుందని మరో ప్రశ్నకు మంత్రి సమాధానం తెలిపారు.
- దేశంలో చెన్నై తర్వాత అతిపెద్ద వాహనాల చోదక శిక్షణ కేంద్రం సిరిసిల్లలో ఏర్పాటైందని మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌లో టీడీగుట్ట రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వీఓఏలకు నెలవారీ వేతనం ఇస్తున్నామని, సెర్ప్ ఉద్యోగుల ఆందోళన అంశం ప్రభుత్వ దృష్టిలో ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు వివరించారు.